క్లుప్తంగా

22 నుంచి సంగీత, నృత్య ఉత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక సినిమారోడ్డులోని సూర్యకళా మందిరంలో ఈ నెల 22 నుంచి 25 వరకూ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాలు నిర్వహిస్తారని సరస్వతీ గానసభ గౌరవ అధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న సాయంత్రం 6.30 గంటలకు కొచ్చిన్‌కు చెందిన గంగా శశిధరన్ వయోలిన్ కచేరి, 23న సాయంత్రం విజయవాడకు చెందిన లంక తేజస్వీ గాత్రకచేరి, 24న సాయంత్రం చెన్నైకు చెందిన విఘ్నేష్ ఈశ్వర్ గాత్ర కచేరి, 25న సాయంత్రం బెంగుళూరుకు చెందిన వసంత్‌కిరణ్ లీల కల్పతరు అంశంపై కూచిపూడి నృత్యం ఉంటుందన్నారు. సంగీత అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

దసరా వేడుకలకు రాట ముహూర్తం



డాల్ఫిన్ కాలనీలో దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక సాంబమూర్తినగర్ డాల్ఫిన్ కాలనీలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాట ముహూర్తం చేశారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకూ దసరా ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే నెల 2న అమ్మవారి విగ్రహ నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం అమ్మవారి ఆలయంలో అన్నదాన కార్యక్రమం, మహిళలకు కుంకుమ పూజలు నిర్వహిస్తామని అన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జీతాల పెంపుపై హర్షం



సర్పంచ్ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న పారిశుధ్య కార్మికులు

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల జీతాల పెంపుదలతో హర్షం వ్యక్తం చేశారు. రెండు రోజుల పాటు నిరసనకు దిగిన పారిశుధ్య కార్మికులతో ఎంపీడీఓ సతీష్, ఈఓపీఆర్‌డీ సీతారామాంజనేయులు చర్చలు జరిపారు. జీతాలు పెంపు డిమాండ్ పట్ల వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ సానుకూలంగా స్పందించి వారికి అండగా నిలిచారు. తమ డిమాండ్ నెరవేరడంతో పారిశుధ్య కార్మికులు గురువారం సర్పంచ్ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాకు పిఠాపురం మహారాజా పేరు పెట్టాలి



నల్లమిల్లి శేషారెడ్డి

బాలాజీచెరువు: కాకినాడ జిల్లాకు పిఠాపురం మహారాజా పేరు పెట్టాలని ఆదిత్య యూనివర్సిటీ చాన్సిలర్ నల్లమిల్లి శేషారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు భాషకు చిరస్మరణీయమైన రచనలు అందించి గొప్ప సంస్కరణ వాదిగా తెలుగు ప్రజలకు ఎనలేని సేవలు చేసిన మహనీయుడు పిఠాపురం మహారాజా అని అన్నారు. తెలుగు భాషా వికాసానికి శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు తయారు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆదిత్య విద్యా సంస్థలు, పిఠాపురం మహారాజా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అక్టోబర్ 5న మహారాజా జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు, జాతీయ స్థాయి కథ, కవిత సంపుటిల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న ఉమ్మడి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ శ్రీలక్ష్మి

కాకినాడ లీగల్: ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ (సీనియర్ సివిల్ జడ్జి) ఎన్.లక్ష్మి గురువారం తెలిపారు. స్థానిక స్పెషల్ సబ్ జైలులో నిందితులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేకపోతే తమ సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సబ్‌జైలులో ఉన్నప్పుడు మంచి పుస్తకాలు చదువుతూ, చెడు గుణాలను దూరం పెట్టాలని సూచించారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. సబ్ జైలు డిప్యూటీ జైలర్ జోసఫ్, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం కాకినాడ జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలించారు.

ఆటకెక్కించారు!

- జిల్లా క్రీడా మైదానంలో వసతుల కరవు
- ఆరుబయట భోజనాలతో ఇబ్బంది
- తొమ్మిదేళ్లయినా పూర్తికాని డైనింగ్ హాల్, డార్మెటరీ నిర్మాణం



డీఎస్‌ఏలో పూర్తికాని డార్మెటరీ భవన సముదాయం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడా ఎంపికలకు కేంద్రం అది.. అయినా కనీస సౌకర్యాలు కానరాకుంది.. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానం (డీఎస్‌ఏ)లో పరిస్థితి ఇది.. రాష్ట్రంలోనే పెద్ద క్రీడా మైదానంగా పేరొందిన ఇక్కడ ఎండైనా, వానైనా క్రీడాకారులు ఆరుబయటే భోజనాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కడుపు నింపుకోవడం కోసం విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. శాప్ అంటే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్. స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ ఇది. శాప్ అధికారుల నిర్లక్ష్యంతో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రూ.రెండు కోట్లతో చేపట్టిన డార్మెటరీ, డైనింగ్ హాల్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఇది ప్రారంభించి తొమ్మిదేళ్లు అవుతున్నా పూర్తికాని పరిస్థితి. ఆ వివరాల్లోకి వెళితే.. పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 షెడ్యూల్ ఈ నెల 11 నుంచి 19 వరకూ జిల్లా స్థాయిలో వివిధ క్రీడల్లో డీఎస్‌ఏలో నిర్వహిస్తున్నారు. ఈ ఎంపికలకు రోజూ వందల సంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్నారు. వీరికి భోజనాలు వడ్డించేందుకు డైనింగ్ హాల్ లేక ఎంపికలు నిర్వహిస్తున్న ప్రతిసారీ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా, వానైనా భోజనాలు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా క్రీడా మైదానంలో 2016లో అకాడమీ డార్మెటరీ, డైనింగ్, కిచెన్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి శాప్ ప్రిన్సిపల్, సెక్రటరీ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, శాప్ ఎండీ బంగార్రాజు రూ.రెండు కోట్లతో డార్మెటరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిధులు మంజూరు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీతో బిల్డింగ్ ప్లాన్‌ను తయారు చేయించారు. నిర్మించే భవనంలో కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ గదులు, బాత్‌రూమ్‌లు పూర్తి సదుపాయాలతో నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఆర్‌ఈఎస్ ద్వారా భవన నిర్మాణ పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే శాప్ విడుదల చేసిన నిధులకు కేవలం భవనంలో స్కెల్‌టెన్ మాత్రమే నిర్మించారు. ఎలక్ట్రికల్ పనులు, బాత్‌రూమ్స్, తలుపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అసలు రూ.రెండు కోట్లకు నాలుగు అంతస్తుల నిర్మాణానికి ప్లాన్ వేశారు. ఇప్పుడు గ్రౌండ్ ఫ్లోర్ కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. ఈ భవనం పూర్తి కావాలంటే రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు అవుతుందని డీఎస్‌ఏ అధికారులు చెబుతున్నారు.

ఇబ్బంది తప్పడం లేదు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి కాకినాడ జిల్లా విడిపోయిన తరువాత డీఎస్‌ఏ తప్ప క్రీడలపరంగా మౌళిక వసతులు కలిగిన సముదాయం ఇంకొకటి లేదు. రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేటప్పుడు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. పోటీలు నిర్వహించే సమయంలో వర్షం వస్తే క్రీడాకారులు ఆరుబయటే భోజనం చేయాల్సిన పరిస్థితి. ఇటీవల శాప్‌కు కూఆర్ కోడ్ ద్వారా రూ.లక్షలు నెలకు జిల్లాల నుంచి జమ అవుతున్నా భవన నిర్మాణానికి కావాల్సిన నిధులు స్థానిక దాతల సహకారంతో చూసుకోవాలని శాప్ అధికారులు చెప్పడంపై క్రీడాసంఘాల ప్రతినిధులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

సరైన సౌకర్యాలు లేక..



డీఎస్‌ఏలో క్రీడలపరంగా సదుపాయాలు ఉన్నాయి. కానీ భోజనాలకు సరైన సౌకర్యం లేక జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు, ఎంపికల నిర్వహణ ప్రశ్నార్థకంగా మరింది. భోజనాల గదులు అందుబాటులోకి వస్తే ధైర్యంగా రాష్ట్ర, జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ పోటీలను నిర్వహించవచ్చు.

–శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

అందుబాటులోకి వస్తే ఊరట



డీఎస్‌ఏలో డైనింగ్ రూమ్ లేక విద్యార్థులకు ఆరు బయట వర్షం, ఎండలోనే భోజనాలు పెట్టాల్సి వస్తుంది. వచ్చే నెలలో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. అప్పటికైనా డైనింగ్ రూమ్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఒకింత ఊరటగా మారుతుంది.

–సుధారాణి, ఎస్‌జీఎఫ్‌ఐ మహిళా కార్యదర్శి



జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ ఎంపికలకు వచ్చి ఆరుబయటే భోజనాలు చేస్తున్న క్రీడాకారిణులు

ఉపాధి వేతనాల కోసం ధర్నా

కరప: చేసిన పనులకు వేతనాలు చెల్లించాలని, ఉపాధి పనులు కల్పించాలని కూలీలు ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరప ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలు ఆందోళనకు దిగారు. అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుపై నిరసన తెలిపారు. పని పూర్తిచేసినా మస్టర్లు వేయడానికి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, జాబ్‌కార్డు కావాలన్నా మంజూరు చేయడం లేదని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ఈశ్వరరావు, కె.సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిబంధనల మేరకు పనులు చేసిన 15 రోజులకే వేతనాలు చెల్లించాలని, మూడు నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఎండనక, వాననక మురుగు నీరు, ముళ్ల పొదలు, కాలువల్లో ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. వీరికి మెరుగైన సదుపాయాలు కల్పించాల్సింది పోయి, గతంలో అమలు చేసిన సదుపాయాలు తీసివేయడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్టుగా రోజువారీ వేతనం రూ.307 రావడం లేదని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

బోట్‌క్లబ్: డైరీఫారం సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పల్లంరాజునగర్, అయోధ్యనగర్, సెవెన్‌హిల్స్ రోడ్డు, డైరీ ఫారం సెంటర్, సాంబమూర్తినగర్, ఇందిరాకాలనీ, వేంకటేశ్వర కాలనీ, ఎంప్లాయీస్ కాలనీ, బాల వెంకటనగర్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వచ్ఛ గ్రామాలకు సహకరించండి



పెదకొత్తూరులో ప్లాస్టిక్ వల్ల అనర్థాలను వివరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు

కరప: ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు కలుగుతుందని, స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు కోరారు. పెదకొత్తూరులో గురువారం ఆయన పర్యటించి పంచాయతీ, సచివాలయ సిబ్బందికి, ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. తర్వాత ఆయన పంచాయతీ సిబ్బందితో ప్రజలను కలసి వీధుల్లో చెత్త వేయరాదని, పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. తడి చెత్త నుంచి కంపోస్ట్ ఎరువును తయారు చేస్తారని, దానివల్ల పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరుతుందని అవగాహన కల్పించారు. వివాహాది శుభకార్యాలు, ఇతర ఫంక్షన్లలో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు వినియోగించవద్దన్నారు. సర్పంచ్ చింతా నాగలక్ష్మి, కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన అంశాలపై పట్టు సాధించాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ గోపాలకృష్ణ

బాలాజీచెరువు: సాంకేతిక విద్యార్థులు నూతన అంశాలపై పట్టు సాధించాలని జేఎన్‌టీయూకే డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణ అన్నారు. స్కూల్ ఆఫ్ ఏవియానిక్స్, ఐఎస్‌టీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్ డిజైన్, అసెంబ్లీ అండ్ ఫ్లైయిట్ ఆపరేషన్స్‌పై వర్క్‌షాపును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేస్తామన్నారు. జేఎన్‌టీయూకే వర్సిటీ ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉపయోగపడే టూ వీలర్ అంబులెన్స్, అలాగే ఆవిరి ద్వారా మంచినీటి తయారీ వంటి ప్రాజెక్టులు రూపొందించామన్నారు. డాక్టర్ దోలాసందీప్ హాజరై భవిష్యత్‌లో రక్షణ, వ్యవసాయం, ఆరోగ్యం, స్మార్ట్ సిటీ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగంపై వివరించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ బీటీ కృష్ణ, ప్రొఫెసర్ పద్మప్రియ పాల్గొన్నారు.

సర్పంచులకు ముగిసిన శిక్షణ



కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులకు హాజరైన సర్పంచులు

కాకినాడ రూరల్: జిల్లాలోని పలు మండలాలకు చెందిన సర్పంచులకు కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. రెండేసి రోజుల చొప్పున మొత్తం నాలుగు రోజుల పాటు ఆర్‌జీఎస్‌ఏ వార్షిక ప్రణాళిక 2025–26కు గాను గ్రామాల్లో 29 అంశాలపై సర్పంచులకు శిక్షణ అందించారు. కాకినాడ రూరల్, కరప, పెదపూడి, పిఠాపురం, గొల్లప్రోలు, కాజులూరు, యు.కొత్తపల్లి మండలాల సర్పంచులు హాజరయ్యారు. పదవీ కాలం ముగింపు దశకు చేరుకోవడంతో చాలా మంది సర్పంచులు రాలేదు. పలు అంశాలపై కాకినాడ రూరల్ ఎంపీడీఓ సతీష్ అవగాహన కల్పించారు.

నానో యూరియాతో పెట్టుబడులు ఆదా



కొంగోడులో నానో యూరియా, డీఏపీల గురించి వివరిస్తున్న ఎంఏఓ సత్య

కరప: సాగులో నానో యూరియా, డీఏపీల వినియోగంతో పెట్టుబడులు ఆదా చేసుకోవచ్చని ఎంఏఓ ఇమ్మిడిశెట్టి సత్య తెలిపారు. కొంగోడులో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారాన్ని పెంచేందుకు జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలని సత్య అన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. దీంతో ఆరోగ్యకరమైన పంటతో పాటు సర్టిఫికేషన్ ద్వారా మంచి ధరకు పంటను అమ్ముకోవచ్చన్నారు. అనంతరం పంటకు ఆశించే తెగుళ్లు, పురుగుల గురించి వివరించారు. తర్వాత కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు ఆధ్వర్యంలో ఎంఏఓ సత్య నడకుదురులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జీవన ఎరువుల ప్రాధాన్యం, ప్రకృతి వ్యవసాయ విధానంతో నేల ఆరోగ్యం గురించి తెలియజేశారు. అనంతరం ఫ్లకార్డులతో నినాదాలు చేసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణాధికారులు ఎంవీ సతీష్, బండారు శ్రీరాములు, వీఏఏ ఎన్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు బార్లకు లైసెన్సులు

కాకినాడ క్రైం: జిల్లా పరిధిలో నాలుగు బార్లకు అనుమతులు మంజూరయ్యాయి. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి పర్యవేక్షణలో డీఆర్‌ఓ వెంకట్రావు లాటరీ ద్వారా గురువారం వీటిని ఎంపిక చేశారు. తాజా కేటాయింపులలో భాగంగా జనరల్ కేటగిరీలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడు, రిజర్వ్‌డ్ కేటగిరీలో గొల్లప్రోలు నగర పంచాయతీలో ఒక బారుకు అనుమతులు లభించాయి.

వైద్య కళాశాల ఎదుట నేడు నిరసన



కరణం భాను

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి కరణం భాను తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్య అందాలనే లక్ష్యంతో వైద్య కళాశాలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుమతి ఇస్తే, వాటిని పారిశ్రామిక వేత్తలకు అప్పగించడానికి సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని యువతతో శుక్రవారం అమలాపురం వైద్య కళాశాల వద్ద నిరసన తెలుపుతామన్నారు. గత ప్రభుత్వంలో ఐదు వైద్య కళాశాలల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారని, మిగిలిన కళాశాలలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

బాలుడి కిడ్నీ మార్పిడికి సాయం



ఆర్థిక సాయం చెక్కును బాలుడి తల్లిదండ్రులకు అందజేస్తున్న డాక్టర్ బొల్లం సతీష్

కాకినాడ క్రైం: బాలుడికి కిడ్నీ మార్పిడి కోసం శ్రీయువసేన స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందింది. కాకినాడ గ్రామీణ మండలం రేవూరు గ్రామానికి చెందిన గాదె ఫణీంద్ర (6) మూత్రపిండాలు పూర్తిగా పని చేయకపోవడంతో ప్రాణాపాయంతో ఉన్నాడు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ తప్ప మరో దారి లేదని వైద్యులు తేల్చారు. ఈ విషయం తల్లిదండ్రులు శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ దృష్టికి తీసుకు వెళ్లగా, దాతల సాయంతో రూ.2 లక్షల మొత్తం సమకూర్చారు. ద్వారంపూడి వీరభద్రారెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి, సానం హరీష్, కోన సతీష్, మల్ల చంద్రశేఖర్, యాళ్ల సూర్యసోమశేఖర్, సోము స్వాతి, రాజ్‌కుమార్, మొబైల్ వరల్డ్ బాబు, మణికంఠ, కుమార్, దీపక్, బాబి ఈ మొత్తాన్ని సమకూర్చారని సతీష్ అన్నారు. ఈ చెక్కును బాలుడి తల్లిదండ్రులకు గురువారం అందజేశామని తెలిపారు.

వాహన మిత్ర పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

కరప: వాహన మిత్ర 2025–26 పథకానికి సంబంధించి శుక్రవారంతో గడువు ముగిస్తుందని, అర్హులంతా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు, గతంలో వాహన మిత్ర లబ్ధిదారులకు ఈకేవైసీ గడువు తేదీలోగా ఆన్‌లైన్‌లో పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఏఓ బీఎల్ నరసింహం, కార్తీక్ పాల్గొన్నారు.

సమాచార ప్రచార వాహనం ప్రారంభం



సంచార సమాచార ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ నరసింహ నాయక్

కాకినాడ క్రైం: రక్తదానం, హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన, సమాచారం కోసం సంచార సమాచార ప్రచార వాహనాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరసింహ నాయక్ గురువారం ప్రారంభించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ చలమయ్య ఆధ్వర్యంలో, కాకినాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నరసింహ నాయక్ మాట్లాడారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన వాహనంలో వీడియో సహిత సమాచారం సరళంగా అర్థమయ్యే రీతిలో ఉందని తెలిపారు. కళాశాలలు, రద్దీ ప్రాంతాల్లో ఈ వాహనాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. వయసు, లింగ బేధాలు లేకుండా ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలని కోరారు. వాహన ప్రారంభోత్సవంలో జిల్లా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మి, డీఐఓ సుబ్బరాజు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్య దత్త వ్రతాలు



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో సత్య దత్త వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

పిఠాపురం: స్థానిక దత్త క్షేత్రం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో గురువారం సత్య దత్త వ్రతాలు కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేదమంత్రాల నడుమ సత్య దత్త వ్రతం నిర్వహించగా, పలువురు భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ గోశాలలో గోపూజ నిర్వహించారు. ఆలయ ఈఓ సౌజన్య ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు జరిపారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన పెంచాలి



సామర్లకోట మున్సిపల్ హైస్కూల్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్‌పై అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. గురువారం స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంగీకార్ 2025లో భాగంగా సోలార్ విద్యుత్తుకు సంబంధించి విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను హెచ్‌ఎం కె.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు కమిషనర్ బహుమతులు అందజేశారు. విద్యా కమిటీ చైర్మన్ కె.కన్నబాబు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జవహర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు కె.అరుణ, ఏఎల్‌వీ కుమారి, యు.నాగమణి, కాంతిప్రియ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- విద్యార్థులు చేతుల శుభ్రతపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య సూచించారు. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా పసర పండగ

కొత్తపల్లి: వాకతిప్పలోని శెట్టిబలిజపేటలో గురువారం పసర పండగను ఘనంగా నిర్వహించారు. పూర్వ కాలం నుంచి పెద్దాపురం మరిడమ్మవారు ఈ పేటలో రావిచెట్టు వద్ద కొలువై ఉన్నారని, పొలాలు పచ్చదనంతో ఉన్నప్పుడు అమ్మవారికి ధూపదీప నైవేద్యాలతో ఈ పండగ నిర్వహించడం ఆచారంగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో పిల్లలు, పెద్దలు, ప్రజలు సంతోషంగా ఉండాలని ఈ పండగ జరుపుతున్నామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | RASMECC కాకినాడ

ఇ-వేలం ద్వారా వాహనములు అమ్మకం

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారుడు మా బ్యాంక్ నుండి వాహనములు కొనుగోలు నిమిత్తం లోను సౌకర్యంను పొంది వున్నారు. బ్యాంకునకు చెల్లించవలసిన వాయిదాలను సక్రమముగా చెల్లించనందున బ్యాంకు వారు స్వాధీనము చేసుకొనిన వాహనములను "యథాతథ స్థితిలో" ఈ వేలం ద్వారా తేది. 26-09-2025న అమ్ముటకు నిర్ణయించినారు. వాహనముల లోను తాలుకా అసలు బకాయి సొమ్ము మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనుటకై ఈ క్రింది తెలిపిన వాహనములను ఇ-వేలమునకు బిడ్స్ ఆహ్వానించడమైనది.

Sl. No.	Account No. & Borrower Name	Vehicle & Model & Reg Year	Reserve Price & EMD	Vehicle No. & Property ID & Auction ID	Auction Time & Date	For Car Details Contact No
01	Moka Surendra Kumar A/c No. 38805138784	HONDA AMAZE (Diesel) Model : 2019	Rs. 3,20,000/- 32,000/-	AP 39 J 2914 Colour: Silver Grey SBIN38193228 08147405	26-09-2025 & 11a.m to 5p.m	Naveen 9885885881

కనీస బిడ్ పెంపుదల మొత్తం: రూ.5,000/–

నియమ నిబంధనలు : (1) రిజర్వ్ ధర కన్నా తక్కువ ధరకు వాహనములు అమ్మబడవు. (2) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకం ధరలో కనీసం 25%(10+15%) తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్ము 7 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసులు లేకుండా అప్పటి వరకు చెల్లించిన సొమ్మును కోల్పోవుదురు. (3) వేలం వాయిదా వేయుటకు, రద్దుపరుచుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. (4) వాహనములను బ్యాంక్ పనిదినములలో తనిఖీ చేసుకోగలరు. (5) వాహనములు రిజిస్ట్రేషన్ (FRC) బాధ్యత విజయవంతమైన బిడ్డర్ మాత్రమే మరియు రిజిస్ట్రేషన్ పేరు మారిన తరువాత మాత్రమే వాహనములు ఇవ్వబడును. (6) మరిన్ని వివరాలకొరకు చీఫ్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECC కాకినాడ వారిని సంప్రదించగలరు. (7) ఇ-వేలం కొరకు వెబ్‌పోర్టల్ https://baanknet.com నందు సంప్రదించగలరు. సేల్ వివరముల కొరకు https://baanknet.com నందు చూడగలరు. (8) షెడ్యూలు సమయం తరువాత ప్రతి 10 ని.లకు అపరిమిత పొడిగింపు.

గమనిక : గ్యారేజ్ అద్దెను మరియు ఇతర ఖర్చులను విజయవంతమైన బిడ్డరు చెల్లించవలెను.

తేది.19.09.2025, ప్రదేశం : కాకినాడ   సం/- చీఫ్ మేనేజర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECC, కాకినాడ